
స్మార్ట్ సిటీపై ప్రతిపాదనలు ఏవీ?

● కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తాం. నగరవాసులకు మెరుగైన వసతులు, రహదారులు, తాగునీరు, ఉద్యానవనాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు వెళ్తాం.

● 2024 అక్టోబరు 1న పత్తికొండ మండలం పుచ్చకాయలమడ సభలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ









● అమలులోకి రాని సీఎం చంద్రబాబు హామీ

● పార్కుల కబ్జాపై విచారణ అంతేనా..?

● పార్కుల కబ్జాలపై గత సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ఆరా

● వైసీపీ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణకు మంత్రి టీజీ భరత్ హామీ

● నెలలు గడిచినా చర్యలు శూన్యం

● నేడు రూ.201.22 కోట్లతో కర్నూలు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం

కర్నూలు న్యూసిటీ/కర్నూలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్పొరేషన్ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించింది. 52 వార్డులు ఉంటే.. కర్నూలు నియోజకవర్గంలో 32 వార్డులు, పాణ్యం నియోజకవర్గంలో 16 వార్డులు, కోడుమూరు నియోజకవర్గంలో 4 వార్డులు ఉన్నాయి. జనాభా దాదాపుగా 6 లక్షలు మైలురాయి దాటుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2024-25 కార్పొరేషన్ చివరి బడ్జెట్ ప్రవేశ పెట్టారు. వివిధ పన్నులు, అద్దెలు, వివిధ ప్రభుత్వ గ్రాంట్లు ద్వారా రూ.285.74 కోట్ల అంచనాతో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. సవరించిన బడ్జెట్ రూ.180.37 కోట్లు. అంటే.. అంకెల్లో చూపిన బడ్జెట్‌కు వాస్తవ బడ్జెట్‌కు మధ్య రూ.105.37 కోట్లు తేడా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని 2025-26 కార్పొరేషన్ బడ్జెట్‌ను వాస్తవాలకు దగ్గర రూ.201.22 కోట్లతో ప్రవే శ పెడుతున్నట్లు తెలుస్తున్నది. బడ్జెట్‌లో పాటు గత ఏడాది అక్టోబరు 8న జరిగిన సమావేశంలో తీర్మానాలు అమలు చేసే దిశగా నేటి సమావేశం లో పక్కాగా చర్చించాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయంపై తక్షణం ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి నగరపాలక సంస్థకు ఆదేశాలు కూడా వచ్చాయి. అక్టోబరు 8న జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ చర్చకు వచ్చింది. నెలలు గడుస్తున్నాయే తప్ప ప్రతిపాదనలు పంపలేదని తెలుస్తున్నది. వైసీపీ హయాంలో జరిగిన పనులుపై విజిలెన్స్ విచారణ చేయిస్తామని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ కౌన్సిల్ వేదికగా హామీ ఇచ్చారు. పాణ్యం నియోజకవర్గం పరిధిలో ఉండే నగర పాలక వార్డుల్లో పార్కులు కబ్జాకు గురయ్యాయని, విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు శూన్యం. కౌన్సిల్‌లో తీర్మానాలకే దిక్కు లేకపోతే వార్డుల్లో ఇచ్చే హామీలు అమలవుతా యా..? అని పలువురు కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. నగరంలో ప్రధాన రహదారులు, ట్రాఫిక్, శివారు కాలనీల్లో తాగునీరు, సీసీ రోడ్లు, పారిశుధ్యం, వీధిదీపాలు వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. నేడు కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో రూ.201.22 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. బడ్జెట్‌తో పాటు స్మార్ట్‌సిటీ, పార్కుల కబ్జా, గతంలో జరిగిన పనుల్లో అక్రమాలపై కీల క నిర్ణయాలు తీసుకోవాలని కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నా రు.

● పార్కుల కబ్జాపై చర్యలు శూన్యమేనా..?


29వ వార్డులో రోడ్డుపైనే చెత్తాచెదారం

పాణ్యం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కార్పొరేషన్ వార్డుల్లో 16 పార్కులు ఉన్నాయి. పలు పార్కులు కబ్జాకు గురయ్యాయి. ఎన్ని పార్కులు అక్రమణకు గురయ్యాయి..? ఎవరు ఆక్రమించిందీ నిగ్గు తేల్చండి..? అంటూ అక్టోబరు 8న జరిగిన కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే అన్నారు. అంతే కాదు.. పనులు చేయకుండానే రూ.కోట్ల ప్రజాధనం స్వాహా చేశారని, వాటర్స్ వర్క్స్ విభాగంలో శివారు కాలనీలకు వాటర్ ట్యాంకులు పంపుతామని చెబుతున్నారే తప్ప పంపకుండానే పంపినట్లు బిల్లులు స్వాహా చేస్తున్నారని ఎమ్మెల్యే గౌరు చరిత తీవ్రంగా అన్నారు. పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై నిగ్గు తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీ వేస్తామని, వచ్చే సమావేశం నాటికి ఆ కమిటీ నివేదిక సిద్ధం చేయాలని తీర్మానం చేశారు. నెలలు గడిచిపోయానే తప్ప.. కమిటీ మాత్రం వేయలేదు. గతంలో నగరంలో జరిగిన వివిధ పనులుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేయిస్తామని మంత్రి టీజీ భరత్ కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు. ఆ దిశగా చర్యలు శూన్యం.

● అటకెక్కిన పైపుల కుంభకోణం

2020 నవంబరు 20న తుంగభద్ర పుష్కరాల సందర్భంగా పుష్కర పుణ్య స్నా నాల కోసం ఘాట్ల వద్ద తాత్కాలిక మురుగునీరు మళ్లింపు కోసం రూ.4.20-4.50 కోట్లతో కొనుగోలు చేసిన హెచ్‌డీ పైపుల వివాదం ఎటూ తేలలేదు. పుష్కరాలు అనంతరం వీకర్స్ సెక్షన్ కాలనీ పార్కులో ఆ పైపులను భద్ర పరిస్తే.. అగ్ని ప్రమాదంలో కాలిపోయాని ఇంజనీర్లు చెబుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. రూ.28 లక్షల విలువైన పైపులే కాలిపోయాని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మిగిలిన రూ.4 కోట్లు విలువైన పైపులు ఏమయ్యాయి? దీనిపై గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రికార్డులకే పరిమితమైంది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ విచారణ అంశం తెరపై కి వచ్చినా.. ఆ తరువాత చర్యలు శూన్యం. టీడీఆర్ బాండ్ల జారీ అక్రమాలపై చర్చ జరగాలి.

● నగరపాలక సంస్థ బడ్జెట్ వివరాలు:

● 2024-25 బడ్జెట్ అంచనా	: రూ.285.74 కోట్లు
● 2024-25 సవరించిన బడ్జెట్	: రూ.180.37 కోట్లు
● 2025-26 అంచనా బడ్జెట్	: రూ.201.22 కోట్లు

● వీటిపై దృష్టి సారించాలి

● నగరం విస్తరిస్తోంది. ప్రస్తుత జనాభా 6 లక్షలకు పైమాటే అని అంటున్నారు. జనాభాతో పాటుగా కాలనీలు, వాహనాలు, మోటర్‌బైకులు సంఖ్య కూడా మూడింతలకు పైగా పెరిగాయని అంచనా. ఆ స్థాయిలో నగర ప్రధాన రహదారులు విస్తరించడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యపై వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్, ఆర్టీసీ బస్టాండ్, ఐదు రోడ్ల కూడలి, సీ క్యాంప్, చెక్‌పోస్ట్ ఏరియా, గాయత్రీ ఎస్టేట్, కలెక్టరేట్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వీటిపై దృష్టి సారించాలి.

● శివారు కాలనీల్లో తాగునీటి సమస్యతో జనం పడుతున్న అవస్థలు ఎన్నో. స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని స్వయాన సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ దిశగా ప్రతిపాదనలు పంపాలంటూ సీఎంవో ఆఫీసు నుంచి ఆదేశాలు కూడా వచ్చాయి. ఆలస్యం చేయకుండా రహదారులు, తాగునీటి పనులపై తక్షణం ప్రతిపాదనలు తయారు చేయాలి. నేటి సమవేశంలో దీనిపై చర్చ జరగాలి.

● ఆర్టీసీ బస్టాండ్ దొంగలకు అడ్డాగా మారింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, రైతులు లక్ష్యంగా దొంగలు తమ చేతులకు పని చెబుతున్నారు. బాధితులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. రికరీ చేశాక మీ సొమ్ము ఇస్తామని చెప్పి పంపుతున్నారే తప్ప కేసులు నమోదు చేయడం లేదు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ప్రత్యేక పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేసి 24 గంటలు పోలీసు నిఘా ఉంచాలి.

● పాణ్యం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే 16 వార్డులు సహా నగరంలోని 52 వార్డులకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అమృత్-0.2 పథకం కింద తాగు నీటి సరఫరాకు ప్రతిపాదనలు పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు రూ.375-400 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. దీనిపై కూడా చర్చించాలి.

● వేసవి రాబోతుంది. నగర శివారు కాలనీల్లో తాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించాలి. అవసరమైన నిధులు కూడా ఇవ్వాలి. రాబోయే నీటి ముప్పును అధిగమించే లక్ష్యంగా దాదాపు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం 80 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తున్నారు. 120 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంది. అందుకు అనుగుణంగా ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మించాల్సి ఉంది.

● మెజార్టీ కాలనీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. నెలలు గడిచినా మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. ముఖ్యంగా శివారు కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. అదే క్రమంలో సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో పడుతున్న అవస్థలు ఎన్నో. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా పారిశుధ్యం మెరుగుకు, వీధిదీపాలు ఏర్పాటుపై కూడా ఈ సమావేశంలో కార్పొరేటర్ల గళం విప్పాలి.

కర్నూలు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా భూపాల్ రెడ్డి

కర్నూలు లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా జి.భూపాల్ రెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇంత వరకు అయన 7వ అదనపు జిల్లా జడ్జిగా కర్నూలులోనే పని చేస్తున్నారు. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మిరాజ్యంను పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. ఇంతవరకు ఖాళీగా ఉన్న కర్నూలు ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి, నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారిగా గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతిని పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేశారు. ఖాళీగా ఉన్న కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారిగా విశాఖపట్నం జిల్లా గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి ఈ.రాజేంద్రబాబును బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన ఈ న్యాయాధికారులు ఫిబ్రవరి 10వ తేదీలోపు తమ బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు తన ఆదేశాలలో పేర్కొంది.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కౌతాళం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న మహాకుంభాభిషేకం ఉత్సవాలను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేద్దామని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. బుధవారం ఆయన దేవస్థానం కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఉత్సవాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై ఉత్సవాల ఏర్పాట్ల గురించి ఆలయ డిప్యూటీ కమీషనర్ విజయరాజుతో అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. వీరి వెంట ఆలయ ఈఓ విజయరాజు, మండల తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి, ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్ర బాబు, కౌతాళం సీఐ విజయ్ కుమార్, కోసిగి ఎస్ఐ చంద్రమోహన్, డిఎల్‌పీఓ నూర్జహన్, ఎంపీడీఓ సుబ్బరాజు ఉన్నారు.

పందికోన రిజర్వాయర్ పరిశీలన


పందికోన రిజర్వాయర్ వద్ద చర్చిస్తున్న అధికారులు

పత్తికొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపేందుకు బుధవారం ఇరిగేషన్ సిఈ కబీర్‌బాషా, ఎస్ఈ ద్వారకానాథరెడ్డి, ఈఈఈ కిష్టన్న పరిశీలించారు. పత్తకొండ మండలంలోని పందికోన రిజర్వాయర్ ప్రాంతంతోపాటు హోసూరు వద్ద హంద్రీ నీవా కాలువ వద్ద పరిశీలించారు. వారు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల పరిధిలో 16 గ్రామాల పరిధిలోని పంట పొలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రభుత్వాన్ని కోరారన్నారు. సాగునీరు అందితే స్థానికంగా వ్యసాయపనులతో ఆగ్రామాల్లో వలసల నివారణ సాధ్యమవుతుందని, ఆ గ్రామాల పంట పొలలు సస్యశ్యామలం అవుతాయని ఆయన ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారన్నారు. ఈ అంశపై స్పందించిన ప్రభుత్వం ఎమ్మెల్యే కేఈ అభ్యర్థనపై స్పందించి పత్తికొండ ఇంటిగ్రేటెడ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి నివేదికలు ప్రభుత్వానికి పంపేందుకు పత్తికొండ ప్రాంతంలో పరిశీలన చేస్తున్నట్లు వారు తెలిపారు.

శ్రీశైలం జలాశయంలో 853.8 అడుగుల నీటి మట్టం

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయంలో బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 853.8 అడుగుల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్ట్ గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 853.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. అదే క్రమంలో ప్రాజెక్ట్ గరిష్ఠ నీటినిల్వలు 215.8070 టీఎంసీలకుగాను ప్రస్తుతం 88.6777 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. కాగా ప్రాజెక్ట్ నుంచి తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి 35,315 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ఇదిలా వుంటే ఉదయం 6 గంటలకు తెలంగాణ పవర్ హౌస్ 7770 క్యూసెక్కులు, హంద్రీ నీవాకు 1630 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు 2400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడుకు 2500 క్యూసెక్కులు, నీటి ఆవిరి రూపంలో 233 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. అయితే సాయంత్రానికి తెలంగాణ పవర్ హౌస్‌కు నీటివిడుదల 35,315 క్యూసెక్కుల నీటిని పెంచి మిగతా ప్రాజెక్ట్‌లకు నీటినిల్వలను పూర్తిగా నిలిపివేశారు.

తండ్రీకొడుకుల దుర్మరణం

● భార్యకు తీవ్ర గాయాలు

● చెన్నాపురం వద్ద బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

7


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసం

● కేసుల నుంచి బయటపడడానికి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన జగన్

● మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు ఎంఏ షరీఫ్


మాట్లాడుతున్న మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు ఎంఏ షరీఫ్

ఎమ్మిగనూరు, జనవరి29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసమైపోయాయని మాజీ శాసనమండలి చైర్మన్, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. బుధవారం కర్నూలు నుంచి మంత్రాలయం వెళుతూ ఎమ్మిగనూరు పట్టణంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఇంట్లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జగన్ తన ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతిని లేకుండా చేశారని, పోలవరాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. సీబీఐ కేసుల్లో నుంచి బయటపడేందుకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. ఐదేళ్లలో జగన్ తన సంపదనను పెంచుకున్నారే తప్ప రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్ రూ. 9 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. దానికి రూ.60వేల కోట్లు వడ్డీలు చెల్లించాల్సిన దుస్థితి నేడు ఏర్పడిందన్నారు. ఏడు నెలలలోపే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగన్ రెడ్డి కుటుంబం రూ 8లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిందని ఆరోపించారు. ఆ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, టీడీపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస రెడ్డి, దివాకర్ రెడ్డి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

నంద్యాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో 28వ జూనియర్ జాతీయ స్థాయి సెపక్ తక్రా చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహించేలా సీఎం చంద్రబాబు నూతనంగా క్రీడా పాలసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ క్రీడలను ప్రభుత్వంతో పాటు ప్రోత్సహిస్తున్న పలు క్రీడా సంఘాలను అభినందించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు 2 నుంచి 3 శాతం రిజర్వేషన్ పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అమరావతిలో వివిధ జాతీయ క్రీడలను నిర్వహించడం కోసం క్రీడా మైదానాలు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర జాతీయ పోటీలలో నంద్యాల నుంచి క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయ మన్నారు. పద్మావతి నగర్‌లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాధికార సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రిని కోరారు. క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి ఫైరింగ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్ తక్రా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, క్రీడా పాలసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి ఐశ్వరరెడ్డి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసీరెడ్డి, గురురాజా విద్యా సంస్థల చైర్మన్ దస్తగిరిరెడ్డి, క్రీడాపాలసీ జిల్లా అధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి నిమ్మకా యల సుధాకర్, డీఎస్‌డీవో రాజు, రాష్ట్ర పీడీ సంఘం అధ్యక్షులు ఏపీరెడ్డి, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన ఉరుకుంద క్షేత్రం



రంగురంగులతో సుందరంగా తయారైన ఆలయ గోపురాలు

కౌతాళం, జనవరి 29(ఆంధ్రజ్యోతి)

మండలంలోని ఉరకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో జరిగే మహాకుంభాభిషేక ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం, కార్తీక మాసంలో ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి కుంభోత్సవాలు జరపడం విశేషం. ఈ ప్రాధాన్యత రీత్యా భక్తులు పెద్ద ఎత్తున కౌతాళం రానున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు, ఆలయ సిబ్బంది ఆలయం ఈఓతో పనుల్లో నిమగ్నమయ్యారు.

- మహా కుంభాభిషేక ఉత్సవాలకు ఏర్పాట్లు
- భక్తులకు సౌకర్యాల కల్పనలో ఆలయ అధికారులు

ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు:

రాజగోపురంతో పాటు నూతనంగా నిర్మించిన 4 గోపురాలకు రంగులు వేశారు. ఈ గోపురాలపై దాతల సహకారంతో కలశాలను తయారు చేయించి ప్రతిష్టిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు విడిది కోసం కర్ణాటకకు చెందిన ఓ భక్తుడు 50లక్షలతో షెడ్లను నిర్మించారు. రాత్రి సమయాలలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఐమాక్స్ లైట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. స్వామి వారి అన్నదాన సత్రంలో వేల సంఖ్యలో భక్తులు భోజనం చేసే అవకాశం ఉండటంతో సత్రంలో మెరుగైన వసతులు కల్పిస్తున్నారు. మాడ వీధుల్లో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు.



నిత్యం పూజలందుకుంటున్న స్వామి వారి మూలవిరాట్

వివిధ మఠాల పీఠాధిపతుల రాక

మహా కుంభాభిషేకానికి వివిధ మఠాల పీఠాధిపతులు హాజరవుతున్నారు. కంచి కామకోటి పీఠం పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి, పుష్పగిరి మఠం పీఠాధిపతి విద్యాన్సింహ భారతి స్వామి, శ్రీశైల పీఠాధిపతి శ్రీచెన్న సిద్ధరామ శివాచార్య స్వామి, మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామి, హల్వి పీఠాధిపతి మహంతేష్ స్వామి హాజరవుతున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

ప్రముఖులకు ఆహ్వానం:

ఈ మహాకుంభాభిషేక ఉత్సవాలకు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ సత్య నారాయణ, రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడు, మంత్రులు టీజీ భరత్, ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయకుడు, నాయకులు తిక్కారెడ్డి, పలువురు అధికారులను ఆహ్వానించినట్లు ఈఓ తెలిపారు.

ప్రత్యేక కార్యక్రమాలు

మహా కుంభాభిషేకంలో భాగంగా ఆలయం వద్ద ఫిబ్రవరి 1,2,3వ తేదీలలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. రాజగోపురంతో పాటు తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ గోపురాలను అలంకరించనున్నారు. నవగ్రహల మంటపం, గణపతి విగ్రహ ప్రతిష్టాపన, హోమాల నిర్వహణకు ప్రత్యేక గదులు నిర్మిస్తున్నారు. చివరి రోజు కలశాల ప్రతిష్టాపనకు కర్ణాటక భక్తుడు ఒకరు హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతల సహకారంతో మునుపెన్నడు చూడని రీతిలో ఆలయం వద్ద వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.



హోమాల నిర్వహణకు తాటాకులతో నిర్మించిన యాగశాల



కలశాల ఏర్పాటుకు గోపురాలకు ఏర్పాటు చేసిన మెట్లు

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. పర్యావరణం, నీటి వనరుల పరిరక్షణపై బుధవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో జరిగిన ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే ముందుతరాల వారికి మంచి జీవితాన్ని ఇచ్చిన వారమవుతామని ఆయన తెలిపారు. నీటి వనరుల పరిరక్షణపై, కాలుష్య నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ కార్పొరేషన్ సిబ్బంది కర్నూలు నగరంలో ఉన్న చెత్తను సకాలంలో సేకరిస్తూ నగరాన్ని పర్యావరణహితంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీ కిషోర్ రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి పలువురు ప్యానెళ్ల అడ్వకేట్లు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు ఒక్క అవకాశం

కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 2015,2016, 2017, 2018 సంవత్సరాలకు సంబంధించి కోర్సు పూర్తి చేసుకోలేని వారికి ఒక అవకాశాన్ని కల్పిస్తున్నట్లు రాయలసీమ యూనివర్సిటీ పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు ప్రాక్టికల్స్, 6 నుంచి 16 వరకు థీయరీ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోలేని వారు ఈనెల 31 లోపు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తుకు తగిన రుసుం చెల్లించాలని తెలిపారు.

చేపల పెంపకంతో జీవనోపాధి

జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి



వెలుగోడు జలాశయంలో చేప పిల్లలు వదులుతున్న దృశ్యం

వెలుగోడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జలాశయాలలో చేపల పెంపకంతో ఎంతో మంది మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కలుగుతుందని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి అన్నారు. బుధవారం వెలుగోడు తెలుగుగంగ జలాశయంలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఐదు లక్షల చేప పిల్లలను జలాశయంలో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా వీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు నవీన్, టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ అబ్దుల్‌కాలం, మద్దెల శంకరరెడ్డి, రఘుస్వామిరెడ్డి, పాల శంకరరెడ్డి, ఎఫ్‌డీవోలు సామన్న, నాయక్, ఆర్ఐ వెంకటరామిరెడ్డి, వీఆర్వో చక్రి పాల్గొన్నారు.

క్రిష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

వెలుగోడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీయ తాగునీటి సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌ను కలిసి పలు డిమాండ్‌లతో కూడిన డిమాండ్ల వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భాస్కరరెడ్డి, నసురుల్లాఖాన్, రామచంద్రారెడ్డి, రవికు మార్, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో క్రీడల్లో గెలవాలి

- ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం స్టూడెంట్ అఫైర్స్ డీన్ కరుణ సాగర్
- వ్యవసాయ విద్యార్థుల క్రీడా పోటీలు ప్రారంభం



బెలూన్లు ఎగర వేస్తున్న ప్రముఖులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్టూడెంట్ అఫైర్స్ డీన్ కరుణ సాగర్

మహానంది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని, పోటీతత్వంతో పాల్గొని గెలవాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఆఫీసర్ కరుణ సాగర్ తెలిపారు. బుధవారం మహానంది వ్యవసాయ కళాశాల క్రీడామైదానంలో రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థుల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రారంభ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ కరుణ సాగర్‌తో పాటు ఇతర ప్రముఖులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాన్ని స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక సామర్థ్యాన్ని పెంచడమే కాక మానసిక దృఢత్వాన్ని, సామర్థ్యాన్ని కూడా పెంచుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జి రంగా పాలిటెక్నిక్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, నంద్యాల ఏడీఆర్ జాన్సన్, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, యూనివర్శిటీ ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్‌రెడ్డి స్టూడెంట్ యక్టివిటీస్ ఇన్‌చార్జి ఆఫీసర్ ఎల్, విజయభాస్కర్‌తో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

నంద్యాల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల మండల్ లీగల్ సెల్ చైర్మన్ వాసుబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జిల్లాకు చెందినవారై ఉండాలని పేర్కొన్నారు. సామాజిక సేవ, చట్ట అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకితభావం ఉన్న వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని, పై స్థాయి విద్యార్హతలు, అనుభవం, చట్ట, సామాజిక సేవల రంగంలో పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయ విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను నంద్యాల మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయాల నుంచి పొందవచ్చని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతోపాటు అవసరమైన పత్రాల ప్రతులను నంద్యాల మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయానికి స్వయంగా లేదా పోస్టు ద్వారా పంపాలని తెలిపారు. దరఖాస్తులను ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5గంటలలోగా పంపించాలని పేర్కొన్నారు.

అన్నదానానికి కూరగాయలు సరఫరా చేస్తాం



మహానందిలో కూరగాయల దాత జంగారెడ్డికి మెమెంటో అందచేస్తున్న వేదపండితులు

మహానంది, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం అమలు పరిచే నిత్యాన్నదాన పథకానికి శాశ్వతంగా కూరగాయలను ఉచితంగా అందచేస్తానని హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి మేకల జంగారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన మిగతా వ్యాపారులతో కలసి మహానందికి వచ్చారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు రవిశంకర్ అవధాని, హనుమంత్‌శర్మ శాల్వతో సన్మానించారు.

జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం


- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సర్వనాశనమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మండిపడ్డారు. కర్నూలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.10 లక్షల కోట్ల అప్పు, ఏడాదికి రూ. 71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపుల భారం రూ. 1.40 లక్షల కోట్ల చెల్లింపు భారం ఆర్థిక వ్యవస్థపై దివాళకు తీసుకొచ్చారని మండి పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి గుది బండగా మారి ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి తెచ్చిందని గణాంకాలతో ప్రజలకు వివరిస్తే, జగన్ పత్రికలో తప్పుడు కథనాలతో చంద్రబాబు అన్న మాటలను వక్రీకరించడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. డిగ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, చిక్కీలు, కోడిగుడ్ల బకాయిలు, ధాన్యం బకాయిలు, ఉద్యోగులకు బకాయిలు, ఇరిగేషన్ కాంట్రాక్టర్లకు బకాయిలు, గృహ నిర్మాణ బకాయిలు, ఉపాధి హామీ బకాయిలు ఇలా జగన్ ప్రభుత్వంలో దాదారు రూ.1.40 లక్షల కోట్ల అప్పులు పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగు నీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జుల్సాలకు ఖర్చు చేసి తినేశారని మండి పడ్డారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రాధాన్యత ఇస్తూ ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అరు. దావోస్ పర్యటనలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమని అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- అధికారికంగా నిర్వహించడంపై 'కుడా' చైర్మన్ సోమిశెట్టి హర్షం



కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఈనెల 31 వాసవీ కన్యకా పరమేశ్వరీ మాతా అత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 'కుడా' చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెనుగొండలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సీఎం చంద్రబాబు, మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పరిశ్రమల శాఖ మంత్రిగా టీజీ భరత్ ఆర్యవైశ్యుల తరఫున సీఎం చంద్రబాబు వద్ద విషయాన్ని వివరించి ప్రభుత్వం తరఫున అధికారికంగా చేయించడంతో చేసిన కృషి అభినందనీయమని అన్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్యవైశ్యులపై చిన్న చూపు ఉండేదని అన్నారు. ఏ మాత్రం విలువ ఇవ్వకుండా దుర్మార్గం వ్యవహరించారని అన్నారు. పైగా దాడులు కూడా చేశారని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని అన్నారు.

ప్రజలను మోసగించిన చంద్రబాబు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అని ప్రజలను భ్రమల్లోకి తీసుకెళ్లి ఎన్నికలు ముగిసిన వెంటనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని పథకాలు అమలు చేయలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షే మ కార్యక్రమాలను అమలు చేస్తూ సుమారు రూ.15 వేల కోట్ల మూలధన వ్యయం చేసారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ కార్యక్రమాన్ని చేయకుండా కేవలం రూ.13 వేల కోట్లు మూలధన వ్యయం చేశారని తప్పుబట్టారు. సమావేశంలో కార్పొరేటర్లు ఎస్‌టీ షేక్ అహ్మద్, యూనుస్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దకడుబూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పెద్దకడుబూరులోని ఎల్లెల్సీ కాలువ పక్కన చెట్టుకు వ్యక్తి ఉరివేసుకొని తంబళ రంగస్వామి(34) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం జరిగింది. పెద్దకడుబూరుకు చెందిన తంబళ రంగస్వామి భార్య ఏడాది క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపంతో ఉన్న రంగస్వామికి అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం వేకువ జామున ఇంటి నుంచి వెళ్లి ఎల్లెల్సీ కాలువ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. తల్లి ఈరమ్మ ఫిర్యాదు మేరకు పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఓ కేసు విషయంలో ఎమ్మిగనూరు పట్టణ పోలీసులు రంగస్వామి కోసం పెద్దకడుబూరుకు వెళ్లి ఆరా తీశారు. ఎమ్మిగనూరు స్టేషన్‌కు రావాలని పలుమార్లు ఫోన్ చేసినట్లు తీశారు. దీంతో తనను అరెస్టు చేస్తారేమోనని భయంతో బుధవారం గ్రామ సమీపంలోని ఎల్లెల్సీ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

దొంగల అరెస్టు



విద్యుత్ మోటార్లు, తీగలను చూపుతున్న సీఐ, ఎస్ఐ

నందికొట్కూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో విద్యుత్ మోటర్లను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలు బుధవారం పట్టుబడ్డారు. బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న దామగట్ల క్రాస్ రోడ్ వద్ద అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడులు చేసి దొంగలను అరెస్టు చేసినట్లు నందికొట్కూరు గ్రామీణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై తిరుపాలు తెలిపారు. వారి వద్ద నుండి మూడు టెక్స్‌మో విద్యుత్ మోటర్లను, 100 మీటర్ల విద్యుత్ రాగి వైర్‌ను స్వాధీనం పరుచుకొన్నట్లు వారు తెలిపారు. వారిలో ఒకరు చెంచు సుంకన్నపై కర్నూలు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. రెండో నిందితుడు చెంచు వెంకటరాముడు కల్లూరు మండలం శ్రీనివాస నగర్‌కు చెందని వాడన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించి రిమాండ్‌కు పంపనున్నట్లు వారు తెలిపారు.

కారు బోల్తా.. ఆరుగురికి గాయాలు



కాలువలోకి దూసుకెళ్లిన కారు

నంద్యాల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలం పోలూరు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకువద్ద బుధవారం కారు బోల్తా పడి ఆరుగురు యువకులకు గాయాలయ్యాయి. నంద్యాల ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన ఖాజా హుసేన్, రమేష్‌తోపాటు మరో నలుగురు యువకులు కారులో పాణ్యం వచ్చారు. పని ముగించుకొని నందికొట్కూరుకు వెళుతుండగా పోలూరు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆరుగురు గాయపడ్డారు. కారు అతివేగంగా నడపడంవల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గాయపడినవారిని స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోలో చోరీ..

ఆటోలో మహిళ బ్యాగులో నుంచి నగదు, బంగారాన్ని చోరీ చేసినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. బుధవారం శిరివెళ్లకు చెందిన కవిత అనే మహిళ ఆటోలో నంద్యాలకు బయల్దేరింది. తన బ్యాగులో రూ.15వేల నగదుతోపాటు బంగారు నగలు పెట్టుకొంది. అయ్యలూరు గ్రామం వద్ద గుర్తు తెలియని మహిళలు ఆటోలో ఎక్కారు. వారు నూనెపల్లె ఆటో స్టాండ్ వద్ద దిగి వెళ్లిపోయారు. ఆటో కొంతదూరం వెళ్లిన తర్వాత కవిత దిగే ప్రాంతంలో పరిశీలించుకోగా తన బ్యాగును కత్తిరించి అందులోని నగదు, బంగారం చోరీకి గురైనట్లు నిర్ధారించుకుంది. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టీఐఎస్‌లో నమోదు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు టీఐఎస్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. జిల్లాలో 19 మంది ఉపాధ్యాయులు ఇప్పటికీ టీఐఎస్‌లో నమోదు చేసుకోలేదన్నారు. అలాగే మరో 99 మంది ఉపాధ్యాయులు వివరాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వీరందరూ ఈ నెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

టెక్నికల్ అఫీషియల్‌గా పరశురాముడు



కర్నూలు స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో జరిగే ఆసియా షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా కర్నూలు జిల్లాకు చెందిన పరశురాముడు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నేపాల్ దేశం కోసి రాష్ట్రంలోని ఇతహరి పట్టణంలో జరగనున్న రెండో ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు షూటిం గ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్‌రాజ్ తోమర్ నుంచి ఉత్తర్వులు అందినట్లు పరశురాముడు బుధవారం తెలిపారు.

ముగిసిన సౌత్ జోన్ ఉడ్‌బాల్ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న సౌత్‌జోన్ ఉడ్ బాల్ పోటీలు బుధవారంతో ముగిసాయి. ఈ పోటీలలో ఆల్ రౌండర్‌లో విజేతగా ఆంధ్రప్రదేశ్ జట్టు విన్నర్‌గా, తమిళనాడు జట్టు రన్నర్‌గా నిలిచాయి. గెలిచిన జట్లకు బహుమతులు ఇస్తారు. ప్రదానోత్సవాకి హార్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ డా. వినోద్ హార్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ ప్రేక్షక గిరి ప్రశాంత్ కుమార్ శ్రీపచవతి ఎస్టేట్ ప్రొపైటర్, క్రిడాయ్ సెక్రటరీ బ్రిజేష్ సింగ్, హాజరయ్యారు.

తండ్రీకొడుకుల దుర్మరణం

అక్కకు ఆరోగ్యం బాగోలేదని.. ఆమెను చూడడానికి కోటెకల్లుకు బయలుదేరిన తమ్ముడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఆయన వెంట ఉన్న నాలుగేళ్ల కుమారుడు కూడా మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. ఎమ్మిగనూరు మండలంలోని చెన్నాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మిగనూరులో సంత చేసుకొని అక్కడి నుంచి కోటెకల్లుకు బయలుదేరిన వీరి బైకును బస్సు ఢీకొట్టింది. ఘటనా స్థలం, ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి.

- భార్యకు తీవ్ర గాయాలు
- ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం వద్ద బైకును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



సామేల్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు



చికిత్స పొందుతున్న శాంతమ్మ



మృతిచెందిన బాలుడు గౌతమ్

ఎమ్మిగనూరు రూరల్/టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నాపురం గ్రామం దగ్గర బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం చెందగా.. భార్య తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి.. ఎమ్మిగనూరు మండలంలోని కోటెకల్ గ్రామానికి చెందిన సామేల్ (27)కు ఎనిమిదేళ్ల క్రితం ఆదోని మండలంలోని పాండవగల్లు గ్రామానికి చెందిన శాంతమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు గౌతమ్(4) ఉన్నారు. వీరు రెండేళ్ల నుంచి ఆదోని మండలంలోని పెద్దపెండేకల్లు గ్రామంలో నివాసం ఉంటూ కూలీ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నారు. సామేల్ చిన్న కూతురు సింధు స్కూలుకు వెళ్లింది. పెద్ద కూతురు స్వాతి కోటెకల్లులోనే సామేల్ తల్లిదండ్రుల వద్ద ఉంటూ చదువుకుంటోంది. సామేల్ సోదరి కూడా కోటెకల్లులోనే నివాసం ఉంటోంది. అయితే ఆమెకు ఆరోగ్యం బాగా లేకపోడంతో ఆమెను చూడడంతో పాటు తల్లిదండ్రులను, కూతురిని చూడాలని సామేల్‌తో పాటు భార్య శాంతమ్మ, కుమారుడు గౌతమ్‌తో కలిసి కోటెకల్లుకు బయలుదేరారు. ఎమ్మిగనూరులో పండ్లు కూడా తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి కోటెకల్లుకు వెళ్తుండగా చెన్నాపురం దగ్గర వీరు వెళ్తున్న బైకును ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. సామేల్, గౌతమ్ అక్కడికక్కడే చనిపోయారు. భార్య శాంతికి ఓ చేయి విరగడంతో పాటు తలకు రక్తగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని సామేలు, గౌతమ్ మృతదేహాల దగ్గర బోరున విలపించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

- ప్రారంభించనున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



మంత్రి టీజీ భరత్‌ను ఆహ్వానిస్తున్న నగర బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్ తుంగభద్ర నదీతీరాన ఉన్న హరిహర క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి వారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఆరంభం అవుతు న్నాయి. ఉదయం 8.30 గంటలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా వచ్చి ధ్వజా రోహణ చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం టీజీ వెంకటేశ్ తన కుటుంబ సభ్యులతో స్వామి, అమ్మవార్ల మహా పూజల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 8 వరకు కొనసాగే స్వామివారి బ్రహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, అలంకార సేవలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు వాహన సేవలు ఉంటాయని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4.30 గంటలకు దీపాలంకరణ సేవ, సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రి 8.30 గంటలకు మంగళహారతి, ఊంజల సేవ, పవళింపు సేవలు ఉంటాయని తెలిపారు.

అన్నదానానికి టీజీ వెంకటేశ్ రూ.2 లక్షల విరాళం

బ్రహ్మోత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి రూ.2 లక్షల విరాళం ప్రకటించినట్లు నగర బ్రాహ్మణసంఘం అధ్యక్ష గౌరవాధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, చెరువు వెంకట దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, ఉప కార్యదర్శులు నాగులవరం రాజశేఖర్, కోశాధికారి సీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై మాట మార్చిన చంద్రబాబు

- వైసీపీ నంద్యాల అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయలేమని సీఎం చంద్రబాబు ఒప్పుకున్నారని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం నగరంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అలవికాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇవాళ పథకాలు ఇవ్వలేమని నిస్సిగ్గుగా ప్రకటించారన్నారు. టీడీపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా వలంటీర్లు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పోస్టులు కుదించిందని అన్నారు.

నీటి పొదుపు శ్రీరామరక్ష

- ఆదర్శ రైతు చంద్రశేఖర్



న్యూఢిల్లీ వ్యవసాయ కేంద్రంలో కర్నూలు రైతు చంద్రశేఖర్

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నీటి పొదుపు రైతులకు శ్రీరామరక్ష అని ఆదర్శరైతు యు చంద్రశేఖర్ అన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలానికి చెందిన రైతు యు. చంద్రశేఖర్ బుధవారం కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ పీడీ ఉమా దేవిని కలిశారు. ఢిల్లీలో జరిగిన విశేషాలను వివరించారు. రాష్ట్రంలోని కర్నూలుతో పాటు అనంతపురం, కడప, పల్నాడు, పార్వతీపురం, ఏలూరు, తిరుపతి జిల్లాల నుంచి ఏడు మంది ఆదర్శ రైతులు, అదే విధంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి రైతులు గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకల అనంతరం జాతీయ వ్యవసాయ విజ్ఞాన కేంద్రం న్యూఢిల్లీలోని పూసా కేంద్రంలో నీటి పొదుపు ద్వారా పంటల సాగులో జరిగే లాభాల గురించి శాస్త్రవేత్తలు తెలిపారని అన్నారు.

రైతులకు ఆన్‌లైన్ గుర్తింపు నెంబర్

- ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభించిన కేంద్రం
- ఆధార్ తరహా ప్రత్యేక గుర్తింపు సంఖ్య



కొలిమిగుండ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశంలో రైతుల గుర్తింపు కోసం ప్రత్యేక ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకవచ్చింది. 26న గణతంత్ర దినోత్సవం రోజున మన రాష్ట్రంలో ఈ పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు ప్రారంభిం చనున్నారు. దీని ద్వారా ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక గుర్తింపు లభించనుంది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ తరహాలో 14 అంకెలతో కూడిన ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తుంది. ఇది దేశంలో రైతు గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. ఈ గుర్తింపు కార్డుల ద్వారా రైతులను అప్రమత్తం చేస్తారు. వాతావరణ మార్పులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తారు. వ్యవసాయ పథకాలను నేరుగా చేరవే స్తారు. పంట నష్టం, ప్రకృతి వైపరీత్యాలు, బీమా పరిహారంలో ఈ గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగకరం కానుంది. రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. స్థానిక రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్ అవగాహన ఉన్న రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, లేదా వెబ్ పోర్టల్‌లో స్వయంగా కూడా నమోదు చేసుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.



రైతులు నమోదు చేసుకోవాలి



రైతులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఆధార్ కార్డు, రైతు పొలం 1.బి ఆధార్‌తో లింక్ ఉన్న మొబైల్ నంబరుతో స్థానిక రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో నమోదు తర్వాత రైతులకు 14 అంకెలతో కూడిన వ్యక్తిగత గుర్తింపు సంఖ్య ఇస్తారు. **- భూమా జ్యోతి, ఏవో.**

కంటి పరీక్షలు లేవు

ఇబ్బంది పడుతున్న ప్రజలు

కోడుమూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కోడుమూరు పీహెచ్‌సీలో కంటి పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో ఐదు నెలలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది ఆగస్టు 17తో సంస్థకు కాంట్రాక్టు గడువు ముగిసిందని తెలిసింది. గతంలో ముఖ్యమంత్రి ఐ కేంద్రం కింద రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు ఉచితంగా ఇచ్చేవారు. దీంతో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి మండల ప్రజలే కాకుండా గూడూరు, సీ బెలగల్, గోనెగండ్ల, క్రిష్ణగిరి, దేవనకొండ మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు కంటివైద్యం కోసం వస్తున్నారు. ఇందుకోసం కంటివైద్య నిపుణుడు, సిబ్బందిని కేటాయించారు. అవసరమైన వారికి అద్దాలు, మందులు ఉచితం గా అందేవి. శస్త్రచికిత్స అవసరమైన రోగులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేసేవారు. గత ఐదునెలలుగా కంటి పరీక్షలు లేవని తెలియక మారుమూల గ్రామాల నుంచి నిత్యం కంటి పరీక్షలకు పీహెచ్‌సీకి వస్తు న్నారు. ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించడం లేదని తెలిసి ఉసూరుమంటూ వెనక్కి వెళ్తున్నారు. కంటి వైద్యం కోసం కొందరు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా పేద, మధ్యతరగతి ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసు పత్రికి వెళ్తున్నారు. దీంతో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి కంటి పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ గత ఆగస్టు 17 నుంచి కంటి పరీక్షలు జరగడం లేదని తెలిపారు.



కోడుమూరు ప్రభుత్వాసుపత్రి

కళ్లను పరీక్షించుకోవడానికి వచ్చా



మాది గోనెగండ్ల మండలంలోని వీరంపల్లి గ్రామం. కిరాణ దుకాణం నడుపుతున్నాం. గత కొన్నిరోజులుగా తలనొప్పి ఉంది. చిన్న అక్షరాలు కనిపించడం లేదు. దీంతో కళ్లను పరీక్షించుకుని, అద్దాలు తీసుకోవడానికి ఆసుపత్రికి వచ్చాను. కంటి పరీక్షలు జరపడం లేదని, వైద్యులు తలనొప్పికి మందులు రాసిచ్చారు. కంటిపరీక్షలు నిలిచిపోయినట్లు తెలియదు. అధికా రులు స్పందించి కంటి పరీక్షలు తిరిగి ప్రారంభించాలి.

- లక్ష్మీదేవి, వీరంపల్లి

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎంఏ షరీఫ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎంఏ షరీఫ్ అన్నారు. నగరంలోని సంతోష్ నగర్ మైనార్టీ బాలుర రెసిడె న్షియల్ పాఠశాలను, పంచలింగాలలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి పరిశీలించారు. అనంతరం విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సంతోష్‌నగర్‌లోని బుడ్డా బుడ్డి మసీదుకు సంబంధించిన ఆరు ఎకరాల భూమిలో నిర్మించిన మైనార్టీ పాఠశాల ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మైనార్టీ ఆస్తులను ప్రజా శ్రేయస్సు కోసమే వాడుకోవాలని కోరారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తుంటారని, వారి కలలు సాకారం అయ్యేలా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. సంతోష్‌నగర్ పాఠశాల ప్రహరీ, డ్రైనింగ్ హాల్, తదితర వసతులను ఏర్పాటు చేస్తామని వివరించారు. అలాగే పంచలింగాలలోని ఏపీ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాలు, కాంపౌండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, డీఎస్పీ మహబూబ్ బాషా, మైనార్టీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ అతిథి గృహంలో మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎంఏ షరీఫ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎండీ షరీఫ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ముస్లింలపై అనేక రూపాలలో దాడులు చేస్తుందన్నారు. బిల్లు సవరణ పేరుతో అన్యమతస్తులను వక్ఫ్ బోర్డులో పెడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్ మహబూబ్, ఇలియాస్, సయ్యద్ బాషా, ఇస్మాయిల్ బాషా పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయొద్దు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వ్యర్థాలను వేయొద్దని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కోరారు. బుధవారం కొండారెడ్డి బురుజు వద్ద పూలదుకాణాల వెనుక ప్రాంతాన్ని ఆయన పరిశీలించి అక్కడ అనేక వ్యర్థాలు ఉండటంతో శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. అదేవిధంగా ధర్మపేట, పాత ఎస్‌బీఐ బ్యాంకు కూడలి, కోట్ల కూడలి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేస్తే ప్రజలు రోగాలబారిన పడతారన్నారు. ఆయన వెంట ప్రజారోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, లోకేష్ ఉన్నారు.

హద్దుల ఏర్పాటుకు కృషి


సర్పంచ్ జయన్నకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

కర్నూలు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో 15ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు హద్దులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు బి.తాండ్రపాడు సర్పంచు ఆకెపోగు జయన్న ఆధ్వర్యంలో బుధవారం రెండు వందల మంది లబ్ధిదారులతో కర్నూలులో విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ 2013లో బి.తాండ్రపాడులోని సర్వేనెంబరు 277లో దాదాపు 1300 మంది పేదలకు ప్రభుత్వ భూమిలో ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇంటి పట్టా ఇచ్చార న్నారు. వీరికి నేటికీ కూడా ప్లాట్లు వేసి హద్దులు ఏర్పా టు చేయలేదని ఆయన వివరించారు. దీర్ఘకాలికంగా ఉన్న ఈసమస్య ఎందుకు ప్రభుత్వ అధికారులు ఎందుకు జాప్యం చేశారో త్వర లోనే కలెక్టర్‌ను కలిసి సమస్యను పరిష్కరిస్తానని విష్ణు హామీ ఇచ్చారు. దీనికి సంబందించిన అర్జీని గ్రామ సర్పంచుకు ఇవ్వాలని ఆయన ప్రజ లకు సూచించారు. విష్ణును కలిసిన వారిలో గ్రామ టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి: ఎంపీడీవో

ఓర్వకల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు కూలీలకు సూచించారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీవోతోపాటు ఏపీడీ లక్ష్మన్న పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వలసలు వెళ్ల కుండా గ్రామంలో జరిగే ఉపాధి పనులను పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో కుమారసాయినాథ్, సీఎల్ఆర్‌సీ కోఆర్డినేటర్ నాగఎర్రమల పాల్గొన్నారు.

గూడూరు: జిల్లాలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పని దినాలు పెంచాలి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం గూడూరు మండలం కె నాగలాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీల దగ్గరకు వారు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రమల, రవి పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: ప్రజలు వలస వెళ్లకుండా ఉపాధి పనులు వినియోగించుకోవాలని ఎంపీడీవో రాము డు కోరారు. బుధవారం చిల్లబండ, అమడగుంట్ల గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అడిగిన వారందరికీ పనులు చూపుతామని, నిర్ణీత కొలతలు పనిచేస్తే పూర్తి వేతనం రూ.300 అందుతుందని అన్నారు. ఉదయం పూట త్వరగా పనుల ప్రదేశానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో మోదీన్‌బాషా, టీఏ పురుషోత్తం పాల్గొన్నారు.

ఏజెన్సీని రద్దు చేయాలి

కర్నూలు హాస్పిటల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అవినీతిని పాల్పడుతున్న ఏజెన్సీని రద్దు చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. తొలగించిన సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కర్నూలు జీజీహెచ్ పరిపాలన విభాగం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, విజయ, రామాంజనేయులు మాట్లాడుతూ కంటి ఆసుపత్రి, నర్సింగ్ కాలేజీ, కర్నూలు జీజీహెచ్ మెడికల్ కాలేజీలో భద్రత కోసం అగ్రిమెంటు దక్కించుకుని పని చేస్తున్న ఏజెన్సీ కొంత మంది అవినీతి సూపర్‌వైజర్ల ద్వారా రిక్రూట్‌మెంటు పేరుతో లక్షలు వసూలు చేశారని ఆరోపించారు.



పరిపాలన విభాగం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

రైతులను నట్టేట ముంచుతున్న కంపెనీలు

ఓర్వకల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులను కంపెనీలు రకరకాల పేర్లతో రేటు తగ్గించి నట్టేట ముంచుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవా రం మండలంలోని నన్నూరు గ్రామంలో పొగాకు కంపెనీ కొనుగోలు చేస్తున్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఓర్వకల్లు మండలంలో 10వేల ఎకరాల్లో పొగాకు పంట సాగు చేశారని, పంట చేతికొచ్చే సమయానికి పొగాకు కంపెనీల యజమాన్యం నల్లగా ఉందని, తేమ ఉందని చెబుతూ రేట్లు వేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, మధుసూదన్, దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగలో మచ్చ తెగులును నివారించండి

కోడుమూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వేరుశనగకు సోకే మచ్చతెగులు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతులకు సూచించారు. బుధవారం గోరంట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటకు యాభై రోజుల తర్వాత మచ్చతెగులు సోకే అవకాశం ఉందన్నారు. నివారణకు హెక్సాకాంజోల్ లేదా ప్రొపికాంజోల్ ఎకరాకు 200 ఎంఎల్ పిచికారి చేయాలని సూచించారు. పంట ఎదుగుదలకు 13-0-45 కేజీ చొప్పున వాడుకోవాలన్నారు. కంది విక్రయించడానికి ఆర్‌ఎస్కేలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో బాలక్రిష్ణ, సిబ్బంది ప్రదీప్ పాల్గొన్నారు.

నాగరాజు సేవలు అభినందనీయం

కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఓబీసీ చైర్మన్ సొంటి నాగరాజు సేవలు అభినందనీయమని జిల్లా ఓబీసీ కాంగ్రెస్ అధ్యక్షుడు సాంబశివుడు అన్నారు. బుధవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జిల్లాలోని నియోజకవర్గాల ఓబీసీ విభాగం సభ్యులు నాగరాజును సన్మానించారు. సాంబశివుడు మాట్లాడుతూ జిల్లాలో ఓబీసీ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

విచారణ జరిపించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగర శివారు బి.తాండ్రపాడు వద్ద ఉన్న జూనియర్ కళాశాలలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ బాలికలకు రక్షణ కల్పించలేని కళాశాలను సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, ఉపాధ్యక్షురాలు పావని పాల్గొన్నారు.

పేదలందరికీ ఇంటి పట్టాలివ్వాలి

కర్నూలు రూరల్ జనవరి 29(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో కొత్తగా వెలసిన 14వార్డులో ఉన్న అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోడు మూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పేరపోగు పెద్దలక్ష్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆ గ్రామస్తులతో కలిసి పెద్దలక్ష్మన్న బుధవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం తహసీ ల్దార్‌కు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా లక్ష్మన్న మాట్లాడుతూ గ్రామంలో ఉన్న నిరుపేదలు దాదాపు 1500 మందికి పైగా ఉన్నారని, వారందరికీ ఇంటి పట్టాలు ఇవ్వా లని తహసీల్దార్‌ను కోరారు.

కల్లూరు ఎంపీడీవో కార్యాలయం తనిఖీ


అధికారులతో చర్చిస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కల్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలతో రికార్డు ఏర్పాటు చేయాలని కర్నూలు జడ్పీ సీఈవో నాసరరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కల్లూరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డు రూం, బోర్ వెల్స్ గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ మండల పరిషత్ కార్యాలయంలో క్రమపద్ధతిలో రికార్డుల నిర్వహణ ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆడిట్ అభ్యంతరాల రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.నాగశేషాచలరెడ్డి, పరిపాలన అధికారి ప్రమీల, మండల అధికారులు పాల్గొన్నారు.

నేడు సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని కేవీఆర్ మహిళా కళాశాలలో 'గాంధేయ సమతా వాదం' అనే అంశంపై వక్తలు ప్రసంగిస్తారని తెలుగు ఉపన్యాసకురాలు డాక్టర్ దండె బోయిన పార్వతీ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. సభాధ్యక్షులుగా గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కేసీ కల్కూర అధ్యక్షతన జరిగే ఈ సభను మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. ముఖ్య అతిథులుగా క్లస్టర్ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, ఏపీ గాంధీ స్మారక నిధి ఉపాధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, హైదరాబాదు గాంధీభవన్ ట్రస్టు నిర్వాహకులు వీవీ ప్రభాకర్ హాజరవుతారని ఆమె పేర్కొన్నారు. సభా నిర్వహణ కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్ నిర్వహిస్తారని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం కోరారు. బుధవారం జేడీ వరలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత

కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్‌లో విధుల్లో ఉంటూ మరణించిన కానిస్టేబుల్ ఎన్ రాజేంద్ర కుటుంబా న్ని ఆదుకుంటామని సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు అన్నారు. బుధవారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలోని రాజేంద్ర సతీమణి సంధ్యకు జూనియర్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామక పత్రం అంద జేశారు. ఏఈఎస్ సీఐ రాజేంద్ర ప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నేడు రైతుబజారులో క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతులు విక్రయానికి కూరగాయలు తీసుకురావద్దని వారు విజ్ఞప్తి చేశారు.

మహా కుంభమేళా ఘటనపై ఎంపీ దిగ్ర్భాంతి

కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడంపై ఎంపీ బస్తిపాటి నాగరాజు ఒక ప్రకటనలో దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. తొక్కిసలాటలో మృతి చెందిన భక్తులకు ఎంపీ ప్రగాఢ సాను భూతిని తెలి యజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

భక్తులకు రక్షణ కల్పించాలి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సుమలత తదితరులు

కర్నూలు కల్చరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు వెళ్లిన భక్తులకు కేంద్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని రోజా మహిలా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత విజ్ఞప్తి చేశారు. సోమ వారం మహా కుంభమేళాలలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన భక్తులకు బుధవారం రాత్రి 48వ వార్డులోని రోజావీదిలో స్థానిక పెద్దలు, మహిళలతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రశేఖరశర్మ, మాధవ ప్రభు, బిస్సమ్మ, ధానేశ్వరి, మీనాక్షి, నాగన్న, శాలిమియా, విశ్వ, అభిరాం పాల్గొన్నారు.

8న రాష్ట్ర పీఈటీలకు సెమినార్

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీఈటీలు, ఎస్ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కాకినాడలో (ఈస్ట్‌గోదావరి)పీఈటీలకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మన్న, చందు నాయక్ తెలిపారు. ప్రతి క్రీడాకారుడు రూ.500లు ప్రవేశరుసుం చెల్లించాలని తెలిపారు. వివరాలకు 9440481007 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు


కొమ్ముచెరువులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కొమ్ము చెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల సమీపాన వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం అమావాస్య పర్వదినం కావడంతో భక్తులు పోటెత్తారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి ఆకుపూజలు చేసి, కాయకర్పూరాలు సమర్పించారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామికి అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. గిడ్డాంజనేయ స్వామిని పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూల మాలలతో అలంకరించారు. హనుమాన్ చాలీసా పఠించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామస్థులు భక్తులకు అన్నదానం చేశారు.

ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్‌ను కలిసిన ఎంపీ

కర్నూలు అర్బన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డిని ఎంపీ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని జీవీరెడ్డి నివాసంలో కలిశారు. జీవీ రెడ్డితో భేటీ అయిన ఎంపీ జిల్లాలో ఫైబర్ నెట్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

ఆక్సిజన్ పైపులైన్ పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆక్సిజన్ పైపులైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్‌తో కలిసి పనులను తనిఖీ చేశారు. క్యాన్సర్ విభాగంలో డే కేర్ కీమోథెరపి రోగులకు అందిస్తున్నామని, క్యాన్సర్ విభాగంలో అల్ట్రాసౌండ్ యంత్రాన్ని అమర్చి ప్రక్రియ పూర్తి చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

65 మంది ఎంపిక

కర్నూలు క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు బుధవారం 18వ రోజు కొనసాగాయి. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 209 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత ఎత్తు ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులో 1600 మీటర్ల పరుగు పరీక్షలో 82 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 30 మంది అర్హత సాధించారు. లాంగ్‌జంప్‌లో 64 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 18వ రోజు 65 మంది అర్హత సాధించారు. హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు హాస్పిటల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించకుండా కన్వీనర్ కోటా కింద ఉన్న విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న నర్సింగ్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్వీనర్ కోటా కింద గోనెగండ్లకు చెందిన మెరిట్ స్టూడెంట్ ఓ కాలేజీలో చేరారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నర్సింగ్ కాలేజీలను నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి హుశేన్, నాయకులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ పాడి రైతులకు సూచించారు. పశు ఆరోగ్య శిబిరాల వారోత్సవాల సందర్భంగా బుధవారం ఉల్చాల గ్రామంలో రైతు లకు మందులను, టీకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీ ప్రసన్న కుమార్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి


ఎంపీ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించా లని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటి ప్రతినిధులు బి.నాగరాజు కర్నూలు ఎంపీని కోరారు. బుధవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ప్రధాన కార్యాలయంగా పని చేస్తున్న టువంటి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దది అని అన్నారు. కార్యక్రమంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీనాయకులు పి.సిద్దప్ప, ఈ.హనుమంతరెడ్డి, పి.సురేష్, ఎంసీవీ రమణారెడ్డి, కె.నాగరాజు, డి.వెంకటేశ్, కే.రవి పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

గూడూరు జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు గ్రామాల్లోని సచివాలయాలను కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి రమణా రెడ్డి బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శివనాగప్రసాద్ ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

సి.బెళగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్ బీసీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎన్నికల ముందు కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరిని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బుధవారం బీసీ కాలనీలో తాగునీటి బోరును వేయించారు. మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, విష్ణుసేన హమాలీ యూని యన్ నాయకుడు భీమన్న, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: డీఎల్‌డీవో: మండలంలోని పోలకల్లు గ్రామంలో పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీవో రమణారెడ్డి హెచ్చరించారు. బుధవారం పోలకల్లు గ్రామ పంచాయతీని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఈశ్వరస్వామి, పంచా యతీ కార్యదర్శి ఈశ్వరస్వామి ఉన్నారు.

వ్యవసాయం.. ఓ జూదం

- దేవనకొండలో ధర లేక చౌళకాయలను వదిలేసిన రైతులు
- మద్దికెరలో గోనె సంచులు లేవని నిలిచిపోయిన కంది కొనుగోళ్లు

దేవనకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చౌళకాయల ధర పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. రూ.వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే, పెట్టుబడి కూడా వచ్చేలా లేదని ఆవేదన చెందుతున్నారు.

పడిపోయిన ధర

రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి సాగు చేస్తే, పంట చేతికందే సమయంలో ధర పతనమైంది. పంట కొత ఖర్చులకు కుడా వెళ్లని దయనియపరిస్థితి నెలకొందని రైతులు అవేదన చెందుతున్నారు. రబీలో సాగునీటి కాల్వ ,బోర్ల కింద రైతుల చౌళకాయ పంటను సాగు చేశారు. ప్రస్తుతం సంచి చౌళకాయల (18 కేజీలు) ధర రూ.200లు గా ఉంది. పంట కోసేందుకు కూలీలకు సంచికి రూ.120లు ఖర్చు కాగా, సంచి కనేందుకు రూ.10, మార్కెట్‌కు రవణాకు రూ.20లు చెల్లించాలి. దీంతో పెట్టుబడి రాకపోగా, నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.


దేవనకొండలో పొలంలోనే వదిలేసిన చౌళకాయలు



రూ.1.5లక్షలు నష్టపోయాను.

ఐదు ఎకరాలు కౌలుకి తీసుకొని చౌళకాయ సాగు చేశాను. పంట మొదటి కొత కోస్తే కూలీలకే సరిపోయింది. మార్కెట్‌లో ధర లేలేకపోవడంతో చేసేదీమీ లేక పొలంలోనే వదిలేశాను. రూ.1.5 లక్షలు నష్టపోయాను. **- మహేష్, రైతు దేవనకొండ**


మద్దికెరలో నిల్వ ఉంచిన కంది దిగుబడి

మద్దికెర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలలో ఖరీఫ్, రబీలో 12వేల ఎకరాల్లో కందులు సాగు చేశారు. ఎకరాకు 5 నుంచి 6 వరకు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అదిగో ఇదిగో అన్న అధికారులు రభుత్వ మద్దతు ధర రూ.7,550ల ప్రకారం కొనుగోలుకు సిద్ధమయ్యారు. అయితే గోనెసంచులు లేకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయా యయి. గోనెసంచులు రాలే దని వచ్చాక కొనుగోలు చేస్తామని మార్క్‌ఎడ్ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు.



ఎదురు చూస్తున్నాం

కందులను కొనుగోలు చేస్తామంటే సంబరపడిపో యాం. విక్రయించుదుకు రాగా, గోనెసంచులు లేవని అధిఆరులు కొనుగోలు చేయడం లేదు. ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని ఎదురు చూస్తున్నాం. **- కృష్ణ, రైతు.**

పరిశీలించాకే నివేదిక ఇవ్వాలి

మద్దికెర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ సూచించారు. బుధవారం కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పొరపాట్లు జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి, సచివాలయాలకు వెళ్లి దరఖాస్తుల వివరాలను తెలుసుకోవాలని కోరారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు రంగస్వామి ఉన్నారు.

విజయవాడలో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బుధవారం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయంలో మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీడీపీ కార్యకర్త మృతి

వెల్దుర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చెర్లకొత్తూరు గ్రామ టీడీపీ కార్యకర్త చంద్రహాస్ చౌదరి బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. మండలాధ్యక్షుడు బలరాంగౌడ్, రమాకాంత్‌రెడ్డి, పుల్లయ్య మృతేదేహానికి నివాళి అర్పించారు.

జట్కా కాలనీని కాపాడండి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో బైపాస్ ఆనుకుని వున్న జట్కా కాలనీని కబ్జాదారుల నుంచి కాపాడాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహేబ్ అధికారులను కోరారు. బుధవారం తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే.నెం.308/3 ప్రభుత్వ భూమిలో జట్కా బండి నడిపే నిరుపేదలకు రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కొందరు ఇళ్లు నిర్మించుకోలేక స్థలాలను ఖాళీగా ఉంచడంతో పక్కనే ఉన్న పొలం యజమానులు, బయటి వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు రామాంజనేయులు, కారన్న, తిమ్మయ్య, పెద్ద వీరన్న, నాగిరెడ్డి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

ఆదోని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన నరసప్ప(36) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పదేళ్ల క్రితం దేవనకొండ మండలం కుక్కటికొండ గ్రామానికి చెందిన ఉప్పర వరలక్ష్మితో వివాహమైంది. పిల్లలు కాకపోవడంతో మనస్థాపానికి గురై ఈనెల 15వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కర్నూలులో చికిత్స పొందుతూ, మృతి చెందాడని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోండి


జొన్నగిరిలో రైతులతో మాట్లాడుతున్న సీఈవో గిడ్డయ్య

తుగ్గలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలను రైతులు వినియోగించుకోవాలని ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య సూచించారు. బుధవారం జొన్నగిరి సొసైటీ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతూ సొసైటీలను ఆన్‌లైన్ చేశామని, ఖాతాలు, రుణాల వివరాలు, రికార్డులు ఆన్‌లైన్‌లోనే చూసుకోవచ్చన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో పంట రుణాలు ఇస్తామన్నారు. సిబ్బంది నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

బాలికా విద్య ప్రాధాన్యం తెలియాలి

ఆదోని టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలికా విద్య ప్రాధాన్యం తల్లిదండ్రులకు తెలియాలని కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. 35వ వార్డు అమరావతి నగర్ సచివాయంలో మహిళా వెల్ఫేర్ కార్యదర్శి పవిత్ర అద్యక్షతన సమావేశం నిర్వహించారు. చిన్న పిల్లలకు బడికి పంపకుండా కూలీ పనులకు పంపుతూ వారి జీవితాలను ఛిద్రం చేయడం సరికాదన్నారు. తల్లిదండ్రులతో ప్రతినెలా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయురాలు ప్రసన్న కుమారి, ఏఎన్ఎం, టీచర్ ఈరమ్మ, అంగన్‌వాడి సూపర్‌వైజర్ వాసంతమ్మ, స్వయం ప్రభ, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రేసమ్మ, శ్యామల, పొదుపు గ్రూపుల ఆర్పీలు, ఫాతిమా, కళావతి పాల్గొన్నారు.

క్రీడామైదానాన్ని అభివృద్ధి చెయ్యండి

- శాప్ చైర్మన్‌కు పత్తికొండ నాయకుల వినతి


శాప్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని క్రీడామైదానాన్ని అభివృద్ధి చెయ్యాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తినిలోకనాథ్, తెలుగు రైతు నాయకుడు నరసింహచౌదరి కోరారు. బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో శాప్‌చైర్మన్ రవినాయుడును కలసి మాట్లాడారు. పత్తికొండలో గతంలో టీడీపీ హయాంలో స్టేడియం నిర్మించారని, ప్రహరీ, క్రీడా సదుపాయాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మేనేజర్ హరినాధ్‌గౌడ్ ఉన్నారు.

వేగం కన్నా ప్రాణం ముఖ్యం : డీఎస్పీ

- ఆదోనిలో పోలీసుల బైక్ ర్యాలీ


హెల్మెట్ ధరించి వాహనాలు నడుతుపున్న డీఎస్పీ హేమలత, పోలీసులు

ఆదోని, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వేగం కన్నా ప్రాణం ముఖ్యమని ట్రాఫిక్ నియమాలను పాటించాలని డీఎస్పీ హేమలత సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీసులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రాణాన్ని కాపాడుకోవడానికి హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల డ్రైవర్లు సీట్ బెల్టు ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి డ్రైవింగ్ చేయకూడదని అన్నారు. వాహనా లను నడిపే టప్పుడు కుటుంబం మనకోసం ఎదురుచూస్తుంటారని, వారికి మనమే ఆధారం అని గుర్తించుకోవాలన్నారు. సీఐలు శ్రీరామ్, సూర్యమోహన్ రావు, ఘంటా సుబ్బారావు, రామలింగయ్య, నల్లప్ప పాల్గొన్నారు.

పరీక్షలకు హాజరు కావాలి

ఆలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ బోర్డు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1,3వ తేదీలలో జరిగే పరీక్షలకు ఇంటర్ విద్యార్థులు తప్పక హాజరు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి కోరారు. బుధవారం మాట్లాడుతూ ఫిబ్రవరి 1న నైతిక, మానవత విలువలు, 3న పర్యావరణ అంశాలపై పరీక్షలకు హాజరవుతేనే ఇంటర్ పరీక్షలకు అవకాశం ఉంటుందని విద్యార్థులు గమనించాలని కోరారు.

భూ కబ్జాలపై దర్యాప్తు చేయించండి

ఆదోని టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి హయాంలో ఆదోనిలో భూ కబ్జాలు, ఇతర అక్రమాలపై సిట్‌తో దర్యాప్తు చేయించాలని మైనార్టీ నాయకుడు నూర్ అహ్మద్, విద్యా మంత్రి లోకేశ్‌ను కోరారు. బుధవారం మంగళగిరిలో ఆయనను కలిసి ఈ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథి హయంలో జరిగిన కబ్జాలపై కూడా దర్యాప్తు చేయాలని కోరగా అందుకు లోకేష్ సానుకూలంగా స్పందించారన్నారు.

ఆర్‌వోబీకి భూ సేకరణ చేయండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


భూసేకరణ పత్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, తహసీల్దార్

ఆదోని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం కుప్పగల్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ శివరాముడుతో కలిసి అధికారులు భూసేకరణ చేపట్టారు. వంతెన నిర్మాణానికి ఐదుగురు రైతుల నుంచి సర్వే నెం.221/బి1, సి2బి, 222/2బి, 244, 245లలో 1.46ఎకరాల భూమిని భూసేకరించినట్లు తహసీల్దార్ తెలిపారు.

గడ్డివామి దగ్ధం

దేవనకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూగితాత దర్గా సమీపంలో పింజరి రసూల్ కి చెందిన గడ్డివాము దగ్ధమైంది. మధ్యాహ్నం గడ్డివాము సమీపంలోని పొలం దండకు మంటలు చేలరేగి గడ్డివామికి వ్యాపించాయి. రూ.25 వేల నష్టపోయినట్లు బాధితుడు వాపొయ్యాడు.


దగ్ధమైన గడ్డివామి

అభివృద్ధికి సహకరించండి

- డీపీవో భాస్కర్


కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న డీపీవో

మద్దికెర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని డీపీవో భాస్కర్ కోరారు. బుధవారం మద్దికెరలో నాబార్డు నిధులతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మార్చి ఆఖరులోపు ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలన్నారు. పంచాయతీ దుకాణాల్లో ఉన్నవారి నుంచి అద్దెలు సకాలంలో వసూలు చేయాలన్నారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయించాలని, నిరూపయోగంగా ఉన్నవాటిని బాగు చేయించాలన్నారు. పారిశుధ్య పనులపై దృష్టిపెట్టి, చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. డీఎల్‌పీవో వీరభద్రప్ప, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, కార్యదర్శులు శివకుమార్, సుధాకర్, పరమేశ్వరప్ప, హరికృష్ణ, మంజునాథ్ ఉన్నారు.

అద్దెలు తగ్గించండి

పంచాయతీ దుకాణాల అద్దెలను తగ్గించాలని నాయీ బ్రాహ్మణులు కోరారు. బుధవారం డీపీవో భాస్కర్‌కు ఆ సంఘం అధ్యక్షుడు వీరేంద్ర, రామకృష్ణ వినతి పత్రం అందజేశారు.

పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

గ్రామ కంఠంలోని పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీపీవో భాస్కర్ హెచ్చరించారు. స్థలాలను ఆక్రమించారని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్యాక్రాంతమైన స్థలాన్ని డీపీవో పరిశీలించారు. తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, డీఎల్‌పీవో వీరభద్రప్ప, ఆర్ఐ రవికుమార్, సర్పంచ్ బండారు సుహాసిని పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు చెత్త సంపద కేంద్రానికి సంబందించిన డబ్బులు సొంతానికి వాడుకున్నారని మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ బొమ్మనపల్లి అశోక్ కుమార్ డీపీవోకు వినతి పత్రం అందజేశారు.

హాస్టల్ మరమ్మతులకు రూ.36 లక్షలు


ఈఈ పద్మజతో మాట్లాడుతున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఎస్సీ నెంబర్-2 హాస్టల్ భవన మరమ్మతులకు రూ.36లక్షలు మంజూ రైనట్లు ఏఎస్‌డబ్ల్యూవో బాబు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'అసాంఘిక భవనం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. పనులను ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజను కోరారు. టెండర్లు కూడా పూర్తయ్యాయని రెండు రోజుల్లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. విద్యుత్, ప్రహరీ, వంటగది, మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. పూర్తయిన వెంటనే కళాశాల హాస్టల్ విద్యార్థులను ఇక్కడికి మారుస్తామని తెలిపారు. వీటితో పాటు ఎస్సీ నెంబర్-1 హాస్టల్ భవన మరమ్మతులకు రూ.20లక్షలు, బాలికల హాస్టల్ మరమ్మతులకు రూ.31.96 లక్షలు, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మరమ్మతులకు రూ.28 లక్షలు మంజూరు చేశారని వివరించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తుగ్గలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, హరిత సూచించారు. బుధవారం మండలంలోని తుగ్గలి, పగిడిరాయి గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, జ్వరం వచ్చిన రోజే వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని కోరారు. రెండు రోజులకు మించి జ్వరం వస్తే మూడో రోజు రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల రక్తపరీక్షలు చేస్తున్నామన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుని, అవసరమైన మందులు వాడాలన్నారు.

1న మండల సమావేశం

ఆలూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఫిబ్రవరి 1వ తేదీన మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సయ్యద్ మమబూబ్ బాషా బుధవారం తెలిపారు. వ్యవసాయ శాఖ, గ్రామీణ, మంచినీటి సరఫరా, గృహ నిర్మాణ, ఉపాధి హామీ పథకం, విద్యుత్, విద్యాశాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

కూలీలకు వెంటనే వేతనాలు


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో గీతావాణి

ఆస్పరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పనులు పూర్తి అయిన వెంటనే కూలీలకు వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో గీతావాణి అన్నారు. మండ లంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో బుధవారం ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. హాజరు వివరాలను తెలుసుకున్నారు. కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఏపీవో రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

ఆలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూముల ధరలను పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహకరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆలూరు ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెంచుతున్నట్లు ప్రకటించడం సరికాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వంద శాతం పెంచడం జరిగిందని, ఇప్పుడు మళ్లీ పెంచితే సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- టీడీపీ, బీజేపీ నాయకుల సాయం


ఆర్థిక సాయం చేస్తున్న టీడీపీ నాయకుడు ఉమాపతినాయుడు


సరుకులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంతో నష్టపోయిన రెండు కుటుంబాలను ఆదుకుంటామని టీడీపీ నాయకుడు ఉమాపతినాయుడు అన్నారు. జాలర్ల కాలనీలో అగ్నిప్రమాదానికి గురైన గుడిసెలను బుధవారం పరిశీలించి బాధితులను పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మారుతిరావు, సాకరే ఈరన్న, బిణిగేరి తిమప్ప, సాకరే లక్ష్మణ, దత్త రఘునాథ్, పొందే రాజ్‌కుమార్, ఆశోర్, గిరి, రవి, రంగస్వామినాయుడు, రామస్వామి, రంగన్న, అప్సర్ బాష, పాల్గొన్నారు.


బీజేపీ నాయకుల సాయం

గ్యాస్ సిలిండర్ పేలి, నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, బీజేపీ అధికార ప్రతినిధి ఆదూరి విజయ్ కృష్ణ, కూసూరు రమాకాంత్, మధు, సాయి అన్నారు. జాలర్ల వీధిలో గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన గుడిసెలను బుధవారం పరిశీంచి, నిత్యవసర సరకులను అందజేశారు. ఎమ్మెల్యే పార్థసారథి సూచనల మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఫోన్ ద్వార్ సమాచారం అందజేశారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు అత్యవసన నిదుల ద్వారా సాయం చేయాలని కోరారు. మహాదేవ్, శ్రీనివాస్ ఆచారి, వాల్మీకి సాయిప్రసాద్, వీరేష్, అంజయ్, శ్రీకాంత్, కాశీ, రాము, మణికంఠ, రత్నబాయి పాల్గొన్నారు.

సారా, అక్రమ మద్యం నిర్మూలనకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వర రావు



పత్తికొండ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సారా, అక్రమ మద్యం నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు అన్నారు.

ప్రశ్న: మీ సర్కిల్ పరిధిలోని ఎన్ని మద్యం దుకాణాలు ఉన్నాయి.

జవాబు: సర్కిల్ పరిధిలో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, దేవనకొండ, గోనెగండ్ల మండలాల్లో 14 మద్యం దుకాణాలు ఉన్నాయి.

ప్రశ్న: కల్లుగీత కుటుంబాలకు మద్యం దుకాణాలను కేటాయించారా?

జవాబు: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఈడిగ కులానికి సంభిందించి మద్దికెరకు ఒక దుకాణం మంజూరైంది. దీనికి రూ.2లక్షల డిపాజిట్ చలానా, డీడీ రూపంలో చెల్లించి ఆన్‌లైన్ ద్వారా ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: సారా తయారు చేసే ప్రాంతాలను, వ్యక్తులను గుర్తించారా?

జవాబు: పది గిరిజన గ్రామాలతో పాటు మద్దికెరను గుర్తించాం. సారా నిర్మూలనకు ఎప్పటికప్పుడు విస్తృత దాడులు చేస్తున్నాం.

ప్రశ్న: ఈ మధ్యకాలంలో సర్కిల్ పరిధిలో ఎన్ని కేసులను నమోదు చేశారు?

జవాబు: సారా తయారీకి సంబంధించి 14 మందిపై బెల్టు షాపులు నిర్వహిస్తున్న 32 మందిపై కేసులు నమోదు చేశాము. బెల్టు షాపుల ద్వారా అక్రమ మద్యం విక్రయాలను అరికడుతున్నాం

ప్రశ్న: అక్రమ మద్యం విక్రయాలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: సారా విక్రయాలు, అక్రమ మద్యం సరఫరా, బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తాం. ఆరు నెలల్లో మూడుసార్లు కేసులు నమోదైతే పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తాం.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: డీఎస్పీ



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ

నందవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. బుధవారం మండలంలోని హాలహర్విలో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న సమస్యలను పెద్దవి చేసుకుని ఘర్షణలకు పడరాదని సూచించారు. భూత గాదాలు ఉంటే అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాల న్నారు. యువత ఆన్‌లైన్ జాబ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్ క్రైమ్ గురించి ప్రతి ఒక్కరికి తెలిసేలా వివరించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాల్సి బాధ్యత గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గ్రామాల్లో ఎలాంటి విషయాలు చోటు చేసుకున్న మొదట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సగం సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.

పోరాటాలతో సమస్యలు పరిష్కారం



సర్క్యులర్‌ను చూపుతున్న కార్మికులు, నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోరాటాలతో సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీలో వివిధ క్యాటగిరిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జాతీయ పండుగలకు సెలవులు కావాలని పోరాటాలు చేశారు. స్పందించిన ప్రభుత్వం జనవరి 8న సెలవుల మంజూరు సర్క్యులర్‌ను జారీ చేసింది. దాంతో కార్మికుల ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఏళ్లతరబడి ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, పండుగలకు సెలవులు ఇవాలని ఎన్నో సార్లు ఆందోళన చేసినప్పటికి గత ప్రభుత్వ నిర్లక్ష్యం చేసిందన్నారు. అందుకు కార్మికులు బుద్ధి చెప్పి గద్దె దించారన్నారు. కూటమి ప్రభుత్వం సెలవులు మంజూరు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజు, ఆర్టీసీ కాంట్రాక్ట్ కార్మికులు వీరారెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తున్నాం



కున్నూరులో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

గోనెగండ్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఎంపీడీవో మణిమంజరి తెలిపారు. బుధవారం సాయంత్రం కునేఐరన్ బండ ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వలసలు వెళ్లితే అక్కడ జరిగే ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు. అక్కడ వచ్చే కూలీ డబ్బులే ఇక్కడ కూడా వస్తాయని వలసల వల్ల పిల్లల చదువు దెబ్బ తింటుందని, వారి భవిష్యత్ కోసమైనా ఆలోచించాలని కోరారు. అలాగే గ్రామాలలో ఉపాధి పనులు చేస్తే రోజుకు రూ. 300 కూలి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అనంతశయనా, ఏపీవో మహమ్మద్ బాషా, నజీర్, సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం: వలసలు నివారించి గ్రామంలో ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. మండలంలోని కనకవీడు గ్రామంలో ఉపాధి పనులపై ప్రత్యేకంగా కూలీలు, ప్రజలతో అవగాహన కార్యక్రమం ఏపీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సందిప్, పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఎఫ్ఏ, టీడీపీ నాయకులు డబ్బా ఈరన్న పాల్గొన్నారు.

బీవీతోనే నియోజకవర్గ అభివృద్ధి: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, మాచాపురం మాజీ సర్పంచ్ కాశీంవలి, టీడీపీ నాయకులు చిన్నకొత్తిలి సత్యారెడ్డి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి బీవీ ప్రజల మన్ననలు పొందారన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలుకు సాగునీరు అందించి రైతుల ఎంతో మేలు చేశారన్నారు. గోనెగండ్లతోని జీడీపీ ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందించి వారి దాహార్తిని తీర్చే బ్రహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. మాచాపురం గ్రామానికి కొత్తగా జడ్పీ హైస్కూల్ ఏర్పాటు చేస్తుండటంతో ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

ఎమ్మిగనూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వార్డు టీడీపీ ఇన్‌చార్జీ కొండయ్య చౌదరి తెలిపారు. బుధవారం వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు పరిశీలించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నా మాట అంటే లెక్కేలేదా..?

● ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్
● ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తనిఖీ

కోసిగి జనవరి 29(ఆంధ్రజ్యోతి): నా మాట అంటే లెక్కేలేదా.. నేను మాట్లాడుతుంటే సెల్‌ఫోన్ చూస్తావా.. నేను చెప్పినదేంటీ.. మీరు చేస్తున్నదేంటీ.. అని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. నిరూపయోగంగా ఉన్న వర్మీ కంపోస్టును తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెబితే పట్టించుకోరా అంటూ ఈవోపీఆర్‌డీ హరూన్ రషీద్‌పై సబ్‌కలెక్టర్ మండిపడ్డారు. గతంలోనే సమస్యలు పరిష్కరించాలని సూచించినా చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థులకు హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్ ఆవరణంలో పందులు సంచరిస్తున్నా మీకు కనిపించడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి వచ్చినప్పుడు సమస్యలు అలాగే ఉంటే మీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, తహసీల్దార్ రుద్రగౌడు, వీఆర్వో బసవరాజు ఉన్నారు.

రీసర్వే పనుల తనిఖీ : మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తనిఖీ చేశారు. బుధవారం గ్రామంలో క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీసర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా సర్వే చేయాలన్నారు. అలాగే సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని భూవిస్తీర్ణం, రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఈవోపీఆర్డీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆదోని సబ్ కలెక్టర్

బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన: మండలంలోని ఐరంగల్ గ్రామ సమీపంలో ఉన్న రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, రైల్వే ఇంజనీర్ ఉమాపతి, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, కోసిగి తహసీల్దార్ రుద్రగౌడు ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, వీఆర్వోలు బసవ, రైల్వే, రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారు

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్
● దస్తగిరి స్వామి ముఖద్వారం ప్రారంభం

మంత్రాలయం జనవరి 29ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని మూడు ముక్కలు కాకుండా ప్రజలే అడ్డుకుని కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ హైమద్ షరీఫ్, మాజీ ఐజీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని వగరూరు గ్రామంలో దస్తగిరి స్వామి ముఖద్వారం ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా హాజరుకాగా కర్నూలు దర్గా పీఠాధిపతి హరీఫ్ పాషా ఖాద్రి, ముస్లిం మత పెద్దలు సయ్యద్ షాబీర్ బాషా ఖాద్రి, సయ్యద్ షాఖీర్ ఖాద్రి, సయ్యద్ తలహా ఖాద్రి, ఖాన్ అబ్దుల్లా, నజీర్ అహ్మద్ , సాహేద్ పీరా ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా దస్తగిరిస్వాముల దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అతిథులను మతపెద్దలు సత్కరించారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి ముఖద్వారం శిలాఫలాకాన్ని ఆవిష్కరించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో రైతు రాష్ట్ర కార్యదర్శి నరవ రమాకాంత్ రెడ్డి, నాయకులు పన్నగ వెంకటేశ్, లక్ష్మయ్య, చావిడి వెంకటేశ్, తహసీల్దార్ రవి, అమర్నాథ్ రెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ పాల్గొన్నారు.



దస్తగిరి స్వామి ముఖద్వారం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఏ షరీఫ్, రిటైర్డు ఐజీ ఇక్బాల్, తిక్కారెడ్డి, రాఘవేంద్రరెడ్డి

● అలరించిన కవాలి: ముఖద్వారం ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన మౌలా ఆలీఖాద్రి కవాల్ అలంద్ షరీఫ్ నిర్వహించిన కవాలి ఆకట్టుకుంది. కవాలి చేసిన కళాకారులకు ముస్లిం మతపెద్దలు, నాయకులు సత్కరించారు. వివిధ గ్రామాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులకు గ్రామ పెద్దలు, గ్రామస్థులు దస్తగిరి స్వామి దర్గా నిర్వాహకులు భోజన వసతి కల్పించారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వలసలను ఆపడమే లక్ష్యం

● ఏపీవో విజయ్ మోహన్



ఎమ్మిగనూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూలీలు వలసలు వెళ్లకుండా ఆపడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీవో విజయ్ మోహన్ అన్నారు. గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పించి ప్రతికూలీకి రోజుకు రూ.300 కూలి పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం ఏపీవో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో వలసలను ఆపేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మండలంలో వలసలను ఆపేందుకు ప్రతి గ్రామంలో రోజు కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి కూలీకి రూ.300 కూలి వచ్చేలా పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి?

జవాబు: ఎమ్మిగనూరు మండలంలో మొత్తం 11,268 జాబ్‌కార్డులున్నాయి. అందులో 8,496 జాబ్‌కార్డులు యాక్టీవ్‌లో ఉన్నాయి.

ప్రశ్న: ఎంత మంది కూలీలు ఉన్నారు?

జవాబు: ఎమ్మిగనూరు మండలంలో 1600 మంది ఉపాకూలీలు ఉన్నారు.

ప్రశ్న: ఉపాధి కూలీలకు ఏఏ పనులు కల్పిస్తున్నారు?

జవాబు: ఉపాధి పనులకు వచ్చే కూలీలకు చెక్‌డ్యాంలు, ఫీడర్ ఛానెల్ పనులు, కుంటల్లో మట్టి తీసే పనులు కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఉపాధి బిల్లులు ఎన్ని వారాలుగా పెండింగ్‌లో ఉన్నాయి?

జవాబు: నాలుగు వారాలుగా ఉపాధి కూలీలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్రశ్న: మండలంలో ఉపాధి సిబ్బంది కొరత ఎక్కడైనా ఉందా?

జవాబు: ఎమ్మిగనూరు మండలంలో ఉపాధి సిబ్బంది కొరత ఏమిలేదు. కొన్ని గ్రామాల్లో కొత్తగా ఎఫ్ఏలను కూడా తీసుకున్నాం.

దస్తగిరి స్వామిని దర్శించుకున్న సింగిల్ విండో మాజీ చైర్మన్

మంత్రాలయం జనవరి 29(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామిని మంత్రాలయం సింగిల్ విండో మాజీ అధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. వారికి సర్పంచ్ లింగారెడ్డి, మత పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, మహ్మద్ రఫీక్, ముకురన్న, దర్గా నిర్వాహకులు సయ్యద్ షాబీర్ బాషా ఖాద్రి, తలహా ఖాద్రి, షాకీర్ ఖాద్రి ఉన్నారు.



దస్తగిరిస్వామి దర్గా ముఖద్వారాన్ని పరిశీలిస్తున్న నాయకులు

జగన్ చేసిందంతా అప్పుల పాలనే

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని పాలించిందని, అభివృద్ధి శూన్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం తన నివాసమైన మాధవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో జగన్ రెడ్డి కుటుంబం రూ.8 లక్షల కోట్లు దోచుకుందన్నారు. ఐదేళ్లలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని, భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్, ఇసుక, బియ్యం, స్మార్ట్ మీటర్ల కొనుగోలు వంటి వాటిల్లో అందినకాడికి దోచేసుకున్నారని ఆయన ఆరోపించారు. గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ఫీజురీయంబర్స్‌మెంటు, ధాన్యం బకాయిలు దాదాపు రూ.22వేల కోట్లను సీఎం చంద్రబాబు నాయుడు చెల్లించారన్నారు. ఆర్థిక వ్యవస్థ దివాలా తీసినా, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు కృషి అమోఘమని అన్నారు. ఇప్పటికే పోలవరం, అమరావతి నిర్మాణం వంటి పనులు చేపట్టి దేశంలోనే రాష్ట్రాన్ని నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతారని కొనియాడారు. సమావేశంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, బొజ్జప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



జడ్పీ బాలికోన్నత పాఠశాలను పరిశీలిస్తున్న రిటైర్డ్ ఐజీ ఇక్బాల్

ఎమ్మిగనూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తన సొంత నిధులు రూ.ఐదులక్షలతో డ్రైనేజీ నిర్మాణాన్ని ఏర్పాటు చేయిస్తానని రిటైర్డు ఇక్బాల్‌అహ్మద్ తెలిపారు. బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు డ్రైనేజీ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన డ్రైనేజీ నిర్మాణాన్ని సొంత నిధులతో చేయిస్తానని హామీ ఇచ్చారు. 15 రోజుల్లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయించేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వ రరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీఈటీల సంఘం స్టేట్ కార్యదర్శి జాకీర్ ఉసేన్, మాజీ కార్పొరేటర్ సురేంద్ర, కమిషన్ ఏజెంట్ బందెనవాజ్, చాంద్ లు పాల్గొన్నారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన

కౌతాళం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవారం అమావాస్య సందర్భంగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈఓ విజయరాజు ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో నిర్మించిన రాజగోపురాల నిర్మాణాలు పూర్తి అవడంతో తూర్పు రాజగోపురం నుంచి ఆలయ అధికారులు భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలోని అన్నదాన సత్రంలో ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

'పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాలి'

గోనెగండ్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల నుంచి గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చేలా పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అన్నారు. బుధవారం గోనెగండ్ల మండలంలోని హెచ్ కైరవాడి, వేముగోడు, గోనెగండ్ల పంచాయతీలను వారు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గోనెగండ్లలోని చెత్తసంపదం కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లో 484 పంచాయతీలు ఉన్నాయని, అందులో 410 పంచాయతీలకు చెత్తసంపద కేంద్రాలు ఉన్నాయన్నారు. గోనెగండ్ల గ్రామ పంచాయతీ ఉమేన్ ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపిక అయిందని తెలిపారు. ప్రతి మూడో శనివారం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సేవలు అందించడంలో ఆలస్యం చేయరాదని సూచించారు. ఈఏడాది మార్చి చివరి నాటికి జిల్లాలోని అన్ని పంచాయతీలలో ఇంటిపన్నులు, తాగునీటి పన్ను, దుకాణాల పన్నులు వందశాతం వసూళ్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారి నూర్జహన్, సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీవో భాస్కర్

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి ఫారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామానికి చెందిన కమల్‌నాథ్, నాగరాజు, నీలకంఠ, పద్మ, గిరి, పరమేష్‌లు ఆటోలో కర్నూలుకు బయల్దేరారు. బనవాసిఫారంలోని గురుకుల పాఠశాల సమీపానికి రాగానే వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడడంతో ఆటోలో ఉన్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై రూరల్ ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిరప నాణ్యత పరీక్షలపై అవగాహన



మిరప నాణ్యత పరీక్షలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మిరప నాణ్యత పరీక్షలపై రైతులకు బుధవారం ఈ-మిర్చీ ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ గ్రీన్ సంస్థ, ఉద్యానశాఖ సంయుక్తంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ గ్రీన్ సీనియర్ రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకటగౌడు, అగ్రెస్ట్ శిక్షకులు కేవీకే బనవాసి సంయుక్త కార్యదర్శి రాఘవేంద్ర, రిలియన్స్ ఫౌండేషన్ డీపీఎం కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన మిరప కాయలను నాణ్యత పరీక్షలు చేసుకొని అమ్ముకోవడం వలన మంచి ధర పలుకుతుందన్నారు. మిరప నాణ్యతను పరీక్షించే పరికరాలు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ మీటరు రీడర్స్‌కు ఈపీఎఫ్ చెల్లించాలి



ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటరు రీడర్స్‌కు ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారమే ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు వీరేష్ , ఉరుకుందులు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు విద్యుత్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ మీటరు రీడర్స్ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలో విద్యుత్ మెటీరియర్స్ 76 మంది ఉన్నారన్నారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్లు ఈపీఎఫ్ సర్వీసులకు అనుగుణంగా కట్టడం లేదని, గత మూడు నెలలుగా ఈఎస్ఐ తక్కువగా కడుతున్నారన్నారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్తే మేము ఇచ్చినంత మాత్రమే మీరు తీసుకోవాలని బెదిరింపులకు గురిచేస్తు న్నారన్నారు. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతా మని హెచ్చరించారు. అనంతరం డీఏఈ విజయ్‌రాజు, ఏడీఈ నాగేంద్ర బాబులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరసప్ప, చంద్రశేఖర్, భీమేష్, కిరణ్, శ్రీకాంత్, ఉరుకుందు, ఖాజా, శేఖర్, నరసింహులు, ఏఐటీయూసీ నాయకులు విజయేంద్ర, తిమ్మగురుడు పాల్గొన్నారు.

పదో వార్డులో వైసీపీ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని 10వ వార్డులో వైఎస్ఆర్‌సీపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగేశప్ప, వైస్ చైర్మన్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు నజీర్ మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ సుధాకర్, చేనేత శివప్రసాద్, బడేసాబ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.